ఈ కమిషనర్ మా కొద్దు...!

'కమిషనర్‌పై కలెక్టర్‌కు పిర్యాదు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ వెంకటేశ్వర్లపై మున్సిపల్ ఉద్యోగులు సోమవారం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు వారి సమస్యలను ఏకరువు పెడుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను వినతి రూపంలో కలెక్టర్‌కు అందచేసారు. అనంతరం వారు మాట్లాడుతూ కమిషనర్ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నారని, సిబ్బందికి రావాల్సిన పెండింగ్ బిల్లులపై సంతకాలు చేసేందుకు పైకం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. సిబ్బంది కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలైతే అవసరం నిమిత్తం రెండు రోజులకు మించి సెలవు ఇవ్వకుండా మనోవేదనకు గురిచేయిస్తున్నారన్నారు. ప్రజల నుంచి వివిధ విభాగాలకు వచ్చిన దరఖాస్తులను విభాగ అధికారులకు సంబంధిత గుమస్తాలకు సంబంధం లేకుండా నేరుగా కమిషనరే పని కోసం వచ్చిన ప్రజలను ఇంటికి పిలిపించుకొని వారితో లావాదేవీలు మాట్లాడుకొని నిబంధనలకు విరుద్ధంగా ఫైళ్లపై సంతకాలు చేయమని సెక్షన్ అధికారులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కార్యాలయంలో ఏ విభాగంలో పని జరగాలన్న ప్రతి పనికి ఒక రేటు నిర్ణయిస్తున్నారని, సదరు మొత్తం ఇవ్వనిదే పని అవ్వదనీ.... ఎందుకు అని ప్రశ్నిస్తే నేను కూడా ఉన్నతాధికారులకు, శాసనసభ్యులకు ప్రతినెల కొంత మొత్తం ముట్టజెప్పాలని, నేను ఇక్కడికి రావడానికి కూడా స్థానిక శాసనసభ్యులు, మరి కొంతమంది ఉన్నతాధికారులకు లక్షల్లో చెల్లించి రావడం జరిగిందని ఆ డబ్బు ఎవరిస్తారని ఎదురు ప్రశ్నలతో వ్యవహరిస్తున్నారన్నారు. నాకు ఎంఎల్ఏ అండదండలు ఉన్నాయని, నేను ఎవరికీ భయపడేది లేదని సిబ్బందిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ తీరుపై విసుగుచెందిన కొంతమంది అధికారులు కార్యాలయం నుంచి బలవంతంగా బదిలీ చేయించుకుని వెళ్లిపోయారని, వారికి రిలీవ్ చేయడానికి కూడా చాలా ఇబ్బందులకు గురిచేస్తూ నగదును డిమాండ్ చేసి వారిని రిలీవ్ చేశారని, కొంతమందికి బదిలీలకు అవకాశం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఈయన వ్యవహార శైలి నచ్చక సెలవు పై వెళ్లేందుకు కూడా మేమంతా సిద్ధంగా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లను తక్షణమే బదిలీ చేసి విముక్తి కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రణాళిక, పారిశుధ్య, పరిపాలన విభాగ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎబిసి కేటగిరిలో ఎస్టీ వారికి పోలీస్ ఉద్యోగాలు కేటాయించాలి

విశాలాంధ్ర-బెలగాం : ఎబిసి కేటగిరిలో ఎస్టీ వారికి పోలీస్ ఉద్యోగాలు కేటాయించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం(టిఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ కి చెందినటువంటి ఆదివాసి నిరుద్యోగులకు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్మెంట్‌కి సంబంధించి ప్రకటించిన ఫైనల్ లిస్టులో జిల్లాకు సంబంధించి ఎబిసి కేటగిరిలో పోస్టులు కేటాయించకపోవడం చాలా అన్యాయమని కావున మాయందు దయవుంచి మా కేటగిరి పోస్టులు మాకు ఇప్పించగలవలసినదిగా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు, తోయక గణేష్, ఈశ్వరరావు, మహేశ్వరి, లక్ష్మణ్, వినయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులను అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి

విశాలాంధ్ర-బెలగాం : ఇటీవల ప్రకటించిన కురుపాం, గుమ్మలక్ష్మిపురం ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు, గుమ్మలక్ష్మిపురం డిగ్రీ కాలేజీలో అధ్యాపక పోస్టులు అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని వలు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు వారు పార్వతీపురం ఐటిడిఏ పిఓ అసుతోష్ శ్రీవాస్తవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మంది గిరిజన యువత చదువుకుని, ఉపాధ్యాయ శిక్షణ పొంది నిరుద్యోగులుగా ఉన్నారని వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే పార్వతీపురం మండలం డోకిశీల పాఠశాలలో గత 20 ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న "వాచ్ మాన్" ను బదిలీ చేయాలని డిమాండ్ చేసారు. ఆయన వలన పాఠశాలలో అనేక సమస్యలు వస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు, ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు మజ్జి నారాయణరావు, కొండగొర్రి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలో రైతన్నలు ఎరువులు కోసం ఎదురుచూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు సోమవారము బలిజిపేట స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు కొరతను నివారించే రైతన్నలను ఆదుకోవాలని తెలిపారు రాష్ట్రంలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి దళారులను ప్రోత్సహించి రైతన్నలకు తీవ్ర అన్యాయము ప్రభుత్వం చేస్తుందని రైతులకు అవసరమైన ఎరువులు యూరియా బిజెపి గెలువులను ప్రభుత్వము సకాలములో అందించడంలో ప్రభుత్వము విఫలమైందని బ్లాక్ మార్కెట్లో ఎరువులు తరలిపోయని దాని ఫలితముగా రైతన్నలు దళారులను ఆశ్రయించి ఎక్కువ రేటుకు కొనవలసి వస్తుందని అన్నారు అందుబాటులో ఉన్న అరా కొర ఎరువులు వారి పార్టీ వారికి ఇస్తున్న ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ప్రైవేటు షాపులలో ఓ బస్తా యూరియా 4 నుండి 500 రూపాయలకు కొనవలసి వస్తుందని లేనియెడల పురుగు మందులు సమాన రేటుకు తీసుకోవలసిందిగా షాపు యజమానులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారుమండలంలోని వ్యవసాయ అధికారులు కూడా తమ తీరును మార్చుకుని మండలములోని రైతులందరికీ అందుబాటులో ఉండి వారికి కావలసిన డిఏపి మరియు యూరియా ఎరువులను సంతృప్తిగా అందజేయాలని అధికారులను కోరమైందని తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు జడ్పిటిసిలు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పార్వతీపురం యోగసాధకులు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్వతీపురం కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లాస్థాయి యోగాపోటీలు ముగిసాయి. జిల్లా నలుమూలలనుంచి హాజరైన 10నుంచి 50ఏళ్లవరకు క్రీడాకారులు ప్రతిభా చూపించారు. గెలుపొందినవారికి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.శ్రీరాములు ధ్రువ పత్రాలు, పతాకాలు అందించారు. ప్రధాన కార్యదర్శి మోహన్ గంతాయత్ మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేస్తే జీవితాంతం ఆరోగ్యంగా ఉండవచ్చని తెలియ చేశారు. పరిశీలకులు బి భాస్కర్ రావు గెలుపొందిన విజేతాలకు ఈనెల 21 నుండి 24 వరకు తాడేపల్లిగూడెంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. జడ్జీలుగా కె.జనార్ధనరావు, జి.రామకృష్ణ, గౌరీ శంకరులు వ్యవహరించారు.

ముగ్గురు వికలాంగులకు ట్రై సైకిళ్లను కలెక్టర్ అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ఎంతో మంది లబ్దిపొందుతున్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముగ్గురు వికలాంగులు తాము నడవలేని పరిస్థితిలో ఉన్నామని, తమకు ట్రై సైకిళ్లను మంజూరుచేయాలని సాలూరు మండలం వెలగవలస గ్రామానికి చెందిన కొట్టిస సీతారాం, మజ్జి రాము, గరుగుబిల్లి మండలం గొట్టివలసకు చెందిన యోగిరెడ్డి అప్పలనాయుడు కోరారు. అర్జీదారుల సమస్యను సావధానంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్ తక్షణమే ట్రైసైకిళ్లను పంపిణీ చేసి, తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

8వ తేదీలోపు ఆయకట్టు భూములకు సాగునీరివ్వాలి : ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ డివిజన్ సబ్ కలెక్టర్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో పరిపాలన అధికారి వారికి ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి వర్గం విజ్ఞాపన పత్రం సోమవారం ఇవ్వడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు మాట్లాడుతూ తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ద్వారా పాలకొండ చివరి ఆయకట్టు భూములకు సాగునీరు రాక వరి నాట్లు వేసిన పంటలు ఎండకు ఎండిపోతున్నాయి.కావున తక్షణమే సంబంధిత జల వనరుల శాఖ అధికారులతో చర్చించి సాగునీరు పాలకొండ చివరి ప్రాంతానికి అందించాలని ఆయకట్టు రైతులు మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున విజ్ఞప్తి చేసుకుంటున్నాము. ఈనెల ఎనిమిదో తేదీ నాటికి సాగునీరు అందించకపోతే పదో తేదీ నుండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు ఆయుకట్టు రైతులతో ఆందోళనకు అనుమతి మంజూరు చేయాలని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పాలన అధికారులకు విజ్ఞాపన చేశారు. తురక నాయుడు వలస దగ్గర ప్రధాన కాలవలలో వేసిన చెక్కల పును అడ్డంకులను తొలగించాలి. చివర ఆయకట్టు భూములకు సాగు నీరందించుటకు ఆటంకం లేకుండా చూడాలి. పాలకొండ సెక్షన్-1,2లలో బదిలీ సమయంలో వెళ్లిపోయిన ఖాళీగా ఉద్యోగులు ఏఈను వెంటనే నియమించాలి. ఖరీఫ్ సీజన్ సాగునీటికి ఆటంకం లేకుండా ఉండాలంటే తక్షణమే సీజనల్ లస్కర్లను ఏర్పాటు చేయాలి. ఆయకట్టు సంఘాలతో సమావేశపరిచి సాగునీటికి ఉన్న ఆటంకాలను ఎలా అధిగమించాలో అంశంపై అవగాహన కల్పించాలి. సంబంధిత శాఖ అధికారులు నిరంతరము సాగునీటి సమస్య పరిష్కరించడానికి తగుచర్యలు తీసుకోవాలి. తక్షణమే రైతులకు కావలసిన యూరియా ఎరువులు సమస్యను పరిష్కరించాలంటూ డిమాండ్స్‌తో రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలన అధికారికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు అంపోలు చిన్నమనాయుడు నీటి సంఘం డైరెక్టర్(వడమ), పిట్ట రమణ, కిమిడి రామ్మూర్తి, ఎందవ సూరిబాబు, కే.త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపేవారికి రూ.10వేలు జరిమానా

విశాలాంధ్ర-సీతానగరం : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికినటువంటి వాహన చోదకులను బొబ్బిలిలో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా బొబ్బిలి మెజిస్ట్రేట్ సదరు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 6 గురువ్యక్తులకు 60వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మరల రెండోసారి కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినట్లయితే వారికి జైలు శిక్ష విధించడం జరుగుతుందని మెజిస్ట్రేట్ తెలిపారన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ... ముగ్గురు యువకులు మృతి

విశాలాంధ్ర-కొమరాడ : రోడ్డు ప్రమాదంలో వెనుక నుంచి స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గిరిజన యువకులు మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు తెలిపారు మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోదూరంలో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గిరిజన యువకులు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం కొమరాడ మండలం నాగావళి నది అవతల ఉన్న కోరిశిల గ్రామానికి చెందిన సిగురు కార్తీక్ 21, సిగురు ఉదయ్ కిరణ్ 19, దువ్వాన జగన్ 17 అనే ముగ్గురు యువకులు ఒక స్కూటీపై కోనేరు నుంచి కొమరాడ వైపు వస్తుండగా అదే సమయంలో రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ పేను గురించి బలంగా ఢీకొట్టడం జరిగింది అని తెలిపారు. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఉదయ్ కిరణ్, కార్తీక్ అన్నదమ్ములు మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో తీవ్ర విషాద ఛాయల అములుకున్నాయి. ముగ్గుర యువకులు మృతదేహాలు రోడ్డుపై నుజ్జు అయిపోయి పడిపోవడంతో స్థానికంగా భయానకర పరిస్థితులు ఏర్పడ్డాయి. వేనుక నుంచి ఢీకొన్న లారీ ప్రమాద సమయంలో ఆపకుండా వెళ్లిపోవడంతో స్పందించిన పోలీసులు పార్వతీపురం సమీపంలో ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతుదేహాలను పార్వతిపురం ఏరియా హాస్పిటల్ కు పోస్టుమార్టం నిమిత్తం తరలించిన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్సై కే నీలకంఠం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ విజయ భారతి

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 18న డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి తాత్కాలిక షెడ్యూల్ రూపొందించిందన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే వారు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్లైన్, ఆఫ్లైన్ లలో దరఖాస్తు చేసుకుంటే ప్రథమ ప్రాధాన్యంగా ఆన్లైన్ దరఖాస్తుదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కళాశాలలో ప్రవేశాలకు బి ఏ హిస్టరీ, బిఏ ఎకనామిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 6304036562, 7569163403, 9490146739, 6302358827 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

ఆర్ఓ ప్లాంట్‌కి భూమి పూజ

విశాలాంధ్ర-కూనవరం : బోదునూరు పాలగూడెం మెట్ట రామవరం గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైనతాగునీరు అందించేందుకు ఐ టి డి ఏ ద్వారా ఆర్వో వాటర్ ప్లాంట్ మంజూరు చేయబడింది. కాగా బోదునూరు గ్రామంలో ప్లాంట్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. స్వచ్ఛమైన తాగునీరు లేక అక్కడ ప్రజలు వలు రకాల ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని స్థానిక జడ్పిటిసి గుజ్జ విజయ పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించగా ఈరోజు ప్లాంట్ మంజూరు కావడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, తెలుగుదేశం నాయకులు బరపాటి ప్రకాష్, బిజెపి నాయకులు నోముల రామారావు, జనసేన నాయకులు దాసరి సరేంద్ర ప్రేమ్చంద్ కనితి వీరబాబు నూపా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పిడుగులతో కూడిన భారీ వర్షం

భయభ్రాంతులకు గురైన మండల ప్రజలు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని ఉరుములు, మెరుపులు పిడుగుల ధ్వనులతో భారీ వర్షం కురిసింది. దీంతో పిడుగుల ధ్వనులకు మండల ప్రజలు భయభ్రాంతులకు గురి అయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల సమయం వరకు విపరీతమైన ఎండ కాసింది. మూడు గంటల సమయం నుంచి ఏకధాటిగా గంట పైనే వర్షం కురవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీగా కాసిన ఎండతో కాస్త ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మండల ప్రజలు కాస్త ఉపసమానం పొందారు.

గిరిజన ప్రాంతంలో డిఆర్ డిపోల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి నాదేండ్ల మనోహర్‌కు సర్పంచ్ పాదురంగ స్వామి వినతి

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరా మంత్రి నాదెండ్ల మనోహర్ ను టీడీపీ డివిజన్ నాయకుడు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి దుస్సలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి డిఆర్ డిపోలకు సంబంధించిన వివిధ సమస్యలపై వినతిపత్రం అందిం చారు. అనంతరం మీడియాతో పాండురంగ స్వామి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో డిఆర్ డిపోల సమస్య లను పరిష్కరించాలని గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల డి ఆర్ డిపోలు శిధిలా వ్యవస్థకు చేరుకున్నాయని కొన్ని చోట్లా డి ఆర్ డిపోలు లేక అద్దె భవనాలలో నడుపుతున్నారని మంత్రిని వివరించడం జరిగిందన్నారు. శిధిలావస్థకు చేరుకున్న డి ఆర్ డిపోల భవనాలను తక్షణమే మరమ్మతు చేయాలని, డిఆర్ డిపోలు లేని చోట్ల కొత్త డిఆర్ డిపోలను మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి గడుతుల మురళి, గోమాంగి పంచా యతీ అధ్యక్షులు జంపారంగి ధనుంజయ, టీడీపీ నాయకుడు జంపారంగి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు కృషి చేయాలి

మంత్రికి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు వినతి

విశాలాంధ్ర-కొయ్యూరు : జిల్లాలో అతిపెద్ద మండలమైన కొయ్యూరులో గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందివ్వడం జరిగిందని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గూడెం లక్ష్మణరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 33 పంచాయతీలు ఉన్నప్పటికీ గ్యాస్ గోడౌన్ లేకపోవడంతో చింతపల్లి నుండి గ్యాస్ ఏజెన్సీ ద్వారా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొయ్యూరు తీసుకొస్తున్నారు అన్నారు. దీంతో గ్యాస్ వినియోగదారుల నుండి అదనంగా వంద రూపాయలు వసూలు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా పౌర సరఫరాల సరుకుల కోసం కాకరపాడులో 25 లక్షల రూపాయలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడంవల్ల అక్కడ గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేసినట్లయితే 33 పంచాయతీలో ఉన్నటువంటి మండల ప్రజలందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ అందే అవకాశం ఉంటుందని వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. దీనిపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించి కొయ్యూరు మండలంలో గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శేషుబాబు ఉపాధ్యక్షులు పోట్టిక రాంప్రసాద్ వీర మహిళ సెగ్గే సాయి భావన జయంతి బకులూరుపంచాయతీ జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు నవీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు చేసిన శ్రామికుల బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం:అల్లూరి సీతారామరాజు జిల్లా బీసీ కాలనీవాసులు ఉపాధిహామీ పనులు చేసిన శ్రామికుల బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నామని, వెంటనే అధికారులు పెండింగ్లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని, వడ్డిగూడెం గ్రామ పంచాయతీలోనీ బీసీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది వంద రోజులు పనులు చేశామని, అయినా బిల్లులు చెల్లించటంలో అధికారులు అలసత్వం చేస్తున్నారని, ఈమధ్య రెండు వారాల పేమెంట్లు అయ్యాయని, మిగతా దాదాపు ఆరు వారాల డబ్బులు పడలేదని, ఒక్కో జోడాకు దాదాపుగా 20 వేలు వరకు వస్తాయని వాపోయారు. వంద రోజుల పనులు అయిపోయి రెండు నెలలు అయిందని, పెడింగ్ బిల్లులు చెల్లింపులో ఇంత ఆలస్యం చేస్తే ఎలా బతకాలి అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని నిరుపేదలమని, మా దీన స్థితిని ఉన్నత స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు గుర్తించి మాకు రావాల్సిన వంద రోజుల పనుల పెండింగ్ బిల్లులను వెంటనే మా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీ ప్రసన్న, బి పద్మా, బోర్రా బుచ్చమ్మ, వడ్డానపు పద్మావతి, వేటకాని దుర్గా, ముత్యాల వీరలక్ష్మి, ముత్యాల సత్యవతి, బోర్ర గంగాధర్, బొర్రా వెంకటరమణ, ముత్యాల అప్పలనరస, ముత్యాల సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25 నుండి కొత్త రేషన్ కార్డులు : మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఆగస్టు 25వ తేదీ నుండి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పరిసిలించడానికి, రేషన్ సరఫరా జరుతున్న పనితీరు పరిసిలించడానికి ఈ రోజు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించడం జరిగిందన్నారు. వయో వృద్ధులకు ఇంటికే నిత్యావసర సరుకులు అందిసచడం జరుగుతుందన్నారు. ఎఫ్ పి షాప్‌ల ద్వారా పంపిణీ చేయడం వలన 1వ తేదీ నుండి 15వ తేదీలోగా వెళ్లి తెచ్చుకోవచ్చని, ఈ అవకాశాన్ని అందరికి సంతృప్తికరంగా మార్పును హర్షిస్తున్నారన్నారు. ఆగష్టు 25వ తేదీ నుండి (స్మార్ట్) కొత్త రేషన్ కార్డులు రాష్ట్ర వ్యాప్తంగా 1,46,00000 అందజేయడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ నుంచి అనేక సంస్కరణలు, కొత్త విధానం ప్రజలకు మరింత మేలైన సేవలు అందించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. భారతదేశం లోనే 96.4 శాతం ఈకెవైసి పూర్తి చేసుకుని ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో నిలిచిందన్నారు.

అధ్యక్ష పదవి ఫలితాలపై ఉత్కంఠ...

రెండు పదేవీపట్నంర్యాయాలు గ్రామ కమిటీ సభ్యులతో అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర-దేవీపట్నం : గత కొన్ని రోజులుగా తెలుగు తమ్ముళ్ల మధ్య మండల తెలుగుదేశం అధ్యక్ష పదవికి జరిగిన ప్రచారంలో ఆశా వహులు ఒక్కొక్కరిగా పార్టీ నాయకులు కార్యకర్తలతో బేటీ అనంతరం సోమవారం పార్టీ పరిశీకులు తాజా, మాజీ ఎమ్మెల్యే లైన మిరియాల శిరీషా దేవి, చిన్నం బాబూ రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరావు పర్యవేక్షణ లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో బలమైన పోటీని సభ్యులు మధ్య నెలకొనగా రెండుసార్లు గ్రూపుల వారీ డిస్కషన్ జరిపారు. పోటీలో మిగిలిన ఇద్దరిలో మరిశెట్ల వెంకటేశ్వర రావు, గోళ్ళ చంటి బాబుల మధ్య పోటీ తీవ్రతరం కావటం తో రహస్య ఓటింగుకు వచ్చిన పెద్దలు మొగ్గు చూపారు. నిన్న జరిగిన రంపచోడవరం మండల అధ్యక్ష ఎన్నికల వలే సజావుగా జరుగుతుందని ఆశించిన పార్టీ పెద్దలకు దేవీపట్నం ఎన్నికలు కొంత ఇబ్బంది కలగ జేశాయి. చివరికి పార్టీ సిద్ధాంతాలకు నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని పదేపదే చెప్పడంతో హోరాహోరీగా జరిగిగిన ఫలితాలు కోసం అందరు ఎదురు చూడాల్సిన పరిస్థితి. నేడు జరిగిన అధ్యక్ష ఎన్నికలు బ్యాలెట్ విధానం లో జరిపారు. ఫలితాలు విలువరించాలిసి ఉంది. అభ్యర్థులుగా నిలిచిన గోళ్ళ చంటిబాబు, మరిశెట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి) ఇరువురూ పార్టీ పగ్గాలపై దృష్టి సారించగా నువ్వా నేను అన్నట్టు జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువరించనుంది,ఈ సందర్భంగా పార్టీ నాయకులు పార్టీ పరువును దిగజార్చేలా సామాజిక మాధ్యమాలలో సందేశాలకు స్వస్తి పలకాలని వ్యక్తిగత విషయాలు ఏమైనా ఉంటే మాట్లాడుకుని పరిష్కరించు కోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా ప్రతీ ఒక్కరూ కష్ట పడి పనిచేయాలని తెలిపారు. అయితే ఇరువురిలో ఒకరిని ఏకగ్రీవం చేసేలా ప్రతిపాదనలు చేసినప్పటికీ అభ్యర్థులు ఇరువురూ ఎన్నికలకు వెళ్లడంతో మరోమారు కార్యకర్తలకు నిరాశ ఎదురైంది. ఈరోజు గ్రామ కమిటీల అభిప్రాయాలను నేరుగా రాష్ట్ర అధ్యక్షకనికి పంపించడం జరుగుతుంది అని ఈ విషయాలు ఏవి కూడా స్థానిక ఎమ్మెల్యేకు సైతం తెలియజేయడం జరగదు అని పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలు నిర్ణయించిన అభ్యర్థినే అధ్యక్షులుగా నియమించడం జరుగుతుంది అని నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

నేడే ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టు డిమాండ్స్ డే

- జర్నలిస్టుల న్యాయమైన కోర్కెల సాధన కోసం వినతి పత్రం సమర్పిద్దాం.
- చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ (సతీష్)
- నేడు ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్ట్ డిమాండ్స్ డే

విశాలాంధ్ర-చింతపల్లి : జర్నలిస్టుల న్యాయమైన కోర్కెల సాధన కోసం పాత్రికేయులమంతా సమన్వయంతో పాటు పడాలని చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి స్వామి పిలుపుమేరకు నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన జర్నలిస్టుల డిమాండ్స్ డే ను జయప్రదం చేసేందుకు, అదే క్రమంలో స్థానిక తహసిల్దార్ లకు వినతి పత్రాలు సమర్పించేందుకు చింతపల్లి ప్రెస్ క్లబ్ పాత్రికేయ మిత్రులంతా మంగళవారం 11 గంటలకు స్థానిక ప్రెస్ క్లబ్ వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు సమర్పించేందుకు మిత్రులంతా వ్యక్తిగత బాధ్యతగా కలిసి రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

అంతర్రాష్ట్ర 'ఆర్.వి.నగర్-పాలగడ్డ' రోడ్డు నిర్మాణం పనులు త్వరిగతిన చేపట్టాలి

మంత్రికి జనసేన పార్టీ వినతి



విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం ఆర్వి నగర్ నుండి సీలేరు పాలగడ్డ వరకు రోడ్డు మంజూరైనప్పటికీ పనులు మొదలవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని వర్షాలు పడితే రాకపోకలకు అంతరాయం కలుగుతుందని అనేక వాహనాలు యాక్సిడెంట్లకు గురవుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొందని ఎన్నో ఏళ్ల నుండి ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రభుత్వాలు మారిన పట్టించుకునే నాధుడు లేరని ఈ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి ఈ రోడ్డు పనులను త్వరిగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలని గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి గూడెం కొత్తవీధి జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్రె వీర వెంకట్ తీసుకు వెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని పాఠశాలల వద్దకు చేర్చాలి : యుటిఎఫ్

విశాలాంధ్ర-పార్వతీపురం : మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని పాఠశాలల వద్దకు చేర్చాలని యు టి ఎఫ్ జిల్లా శాఖ అధికారులను కోరుతుంది. కొన్ని మండలాలలో ఈ బియ్యాన్ని మండలం మొత్తానికి 2, 3 చోట్ల ఉంచి అక్కడ నుండి ఉపాధ్యాయులను తీసుకు వెళ్ళామంటున్నారని, ఇది సరికాదు అని యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర భాస్కరరావు అన్నారు. ఈవిధంగా ఉపాధ్యాయులను తీసుకు వెళ్ళమంటే అది వారిపై ఆర్థిక భారం పడటంతో పాటు పాఠశాలలో విద్యార్థుల చదువులకు నష్టం కలుగుతుంది పాఠశాలలకు పాఠశాల వద్దకే బియ్యాన్ని సరఫరా అయ్యేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. పాఠశాలల వద్దకు బియ్యం చేరని పక్షం లో ఉపాధ్యాయులు ఆ పనిని చేయలేరని కనుక వెంటనే జిల్లా కలెక్టర్ గారు, జాయింట్ కలెక్టర్ గారు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలకు పాఠశాల వద్దకు బియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలని యు టి ఎఫ్ విజ్ఞప్తి చేస్తుంది.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

సిపిఎం డిమాండ్

విశాలాంధ- దుంబ్రిగుడ :సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలోని సోమవారం సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పోతురాజు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించారని, అధికారంలో వచ్చిన తర్వాత అదాని కంపెనీ కు వత్తాసు పలకడం వెనుక రహస్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నాడు పగలగొట్టు, నేడు తెచ్చిపెట్టు అన్నట్టు వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఒప్పందాన్ని రద్దు చేసే వరకు ప్రజలందరూ వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ మండల కమిటీ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాంగి.సురేష్ కుమార్, తామర్ల. సూర్యనారాయణ, సత్యనారాయణ, మహేష్, కోటి, గురుమిసింగ్, దేవగున్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రిపూట విధులు రద్దు చేయాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రాత్రిపూట నిబంధనలకు విరుద్ధంగా విధులు అప్పగించడం వలన అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, మాకు కనీస ప్రమాద నివారణ చర్యలు మున్సిపల్ యంత్రాంగం చేపట్టడం లేదని పలువురు పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలియ చేసారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వారు నిరసన చేపట్టి అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సాలూరు ,పాలకొండ పక్క జిల్లాలోని బొబ్బిలి పట్టణాలలో రాత్రిపూట పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని,కేవలం పార్వతీపురంలోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం కార్మికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ఇప్పటికే కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, ఇది కేవలం అనాలోచితమైన పనులు కేటాయింపని తక్షణమే రాత్రిపూట విధులను రద్దుచేసి యధావిధిగా పగటి పూట విధులను కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వి రవణ, బి.సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు బి బాల, భాను ప్రసాద్, మహేంద్ర, రాంబాబులి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం : మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 13మంది ఫిర్యాదుదారులు హాజరుకాగా, అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. చట్ట పరిధిలో పరిష్కారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటుగా డిసిఆర్బీ సిఐ సుధాకర్, ఎస్సై ఫ్రక్రుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల చిన మేరంగి కోటలో ఘనంగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు 77వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.సోమవారం అయన సతీమణి శత్రుచర్ల శశికళా దేవి టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలసి అభిమానులు తీసుకొచ్చిన భారీ కేకు లను కట్ చేశారు ఈ కార్యక్రమానికి బొబ్బిలి శాసనసభ్యులు ఆర్ ఆర్ వి సి హెచ్ కె కె రంగారావు కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరిలు విజయ రామరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మరో భారీ కేక్ కట్ చేసి ఇన్ని సంవత్సరాలు ఆరోగ్యంగా జీవిస్తున్నాను అంటే అది నా అభిమానుల ఆశీస్సులేని ఆయన అన్నారు ఇద్దరు శాసనసభ్యులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కురుపాం బొబ్బిలి పార్వతీపురం నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలోనాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

కోల్పోయినవన్నీ సాధించే వరకు పోరాడుతాం

అఖిలపక్ష పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లిలో కోల్పోయిన ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, చింతపల్లి శాసనసభ నియోజకవర్గాన్ని సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అఖిలపక్ష పార్టీల నాయకులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య సంఘాలతో పాటు అన్ని వర్గాలకు చెందిన చింతపల్లి వాసులతో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చింతపల్లిని అసెంబ్లీ నియోజకవర్గంగా పునరుద్ధరించాలని, ఈ ప్రాంతం నుంచి తరలిపోయిన ఐటీడీఏ, డైరీ ఫారం సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్ని చింతపల్లిలో నెలకొల్పాలంటూ ఆదివారం చింతపల్లి గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తెదేపా, జనసేన, బిజెపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు, ఇతర రంగాలకు చెందిన నాయకులతో కలసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా సంతబయలు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ వద్దనున్న మహాత్మ గాంధీ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన చింతపల్లి, పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అభివృద్ధికి ఆమడ దూరాన ఉండడమే కాక గతంలో అసెంబ్లీ నియోజకవర్గంగా వెలుగొందిన చింతపల్లి గడచిన రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. ఇందులో భాగంగా చింతపల్లికి మంజూరైన ఐటీడీఏను పాడేరు లో నెలకొల్పడం, చింతపల్లి కేంద్రంగా ఉన్న డైరీ ఫారం ను పాడేరు తరలించుకుపోవడం అదే క్రమంలో ఇతర ప్రభుత్వ కార్యాలయాలను, ఆఖరుకు చింతపల్లి నియోజకవర్గాన్నీ సైతం పాడేరులో విలీనం చేయడంతో చింతపల్లి ప్రాంతం మరుగున పడిందన్నారు. ఒకప్పుడు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్న చింతపల్లి నేడు మండల కేంద్రంగా మాత్రమే ఉండడం బాధాకరమన్నారు. రాబోవు రోజుల్లో శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనలో కూడా చింతపల్లి పేరు కాకుండా మరో మండలం పేరు వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తుంది ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇటువంటి నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకుని చింతపల్లిని శాసనసభ నియోజకవర్గంగా పునరుద్ధరించడంతో పాటు, ఐటిడిఏను చింతపల్లికి తరలించాలని, చింతపల్లిలో బీఈడీ కళాశాల ఏర్పాటు చేయాలని వారు నినదించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలకు చెందిన నాయకులే గాక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, వర్తక, వాణిజ్య సంఘ నాయకులు, గ్రామంలో ప్రముఖులు ఈసందర్భంగా తమ తమ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య, ఇతర రంగాలకు చెందిన నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

12న డీ వార్మింగ్ డే విజయవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-బెలగాం : ఈనెల 12వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను జిల్లా కలెక్టరు విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు మందుల పంపిణీ జరగాలని, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. రక్తహీనత నివారణకు నులిపురుగులు నివారణ ఆవశ్యకత ఉందని గుర్తించాలని అన్నారు. నులి పురుగుల వలన రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. అల్బెండజోల్ మాత్ర వేయడం ద్వారా రక్తహీనత నివారణ, పోషకాలు గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలను వేయించాలని, 12వ తేదీన మాత్రలు తీసుకొని పిల్లలకు 20వ తేదీన విధిగా అందించాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎస్. భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,96,612 మంది బాల బాలికలు ఉన్నారని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు ఇప్పటికే క్షేత్రస్థాయికి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 400 మిల్లీ గ్రాముల మాత్రలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. 1 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లోను, 6 నుండి 19 సంవత్సరాల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో నమోదు కాని, పాఠశాలలకు వెళ్ళని పిల్లలు, కిశోరి బాలికలకు అంగన్వాడీల్లో మాత్రలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. భోజనం అనంతరం మాత్రలు మింగించాలని ఆయన చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, మాత్రలు వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్యం లక్షణం కనిపించిన వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏ మోతాదులో : 1 నుండి 2 సంవత్సరాల చిన్నారులకు "అర మాత్ర" గుండగా చేసి వేయించాలని, 2 నుండి 19 సంవత్సరాల విద్యార్థులకు "ఒక మాత్ర" బాగా నమిలి మింగేటట్లు చేయాలన్నారు. అనంతరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టరును సంబంధిత అధికారులతో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తల్లితండ్రులకు వివరించాలని, దీనిపై అందరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఓ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ కె. హేమలత, కెఆర్ఆర్సీ ఎస్డీసీ పి. ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ పిడి ఎం. సుధారాణి, ఆర్బీఎస్కే అధికారి డా. టి. జగన్మోహనరావు, డిసిహెచ్ఎస్ డా. గొర్లి నాగభూషణరావు, సిడిపిఓ జి. శాంతిభవాని, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు

విశాలాంధ్ర- బలిజిపేట : బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లి పాలు తప్పనిసరి అని సిడిపిఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యం పదిలం బలిజిపేట మండలం వంతరం తుమరాడ గ్రామాలలో సోమవారం సి డి పి ఓ మేడం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ, ఎస్.సులేఖ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన తల్లి పాలు ప్రాముఖ్యతపై పలు సూచనలు చేశారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని, తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి సహజ టీకా అని తెలిపారు. ఇందులో ఉండే ప్రోటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్లు, ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వవస్థ బలపడటానికి తోడ్పడతాయన్నారు. వ్యాధుల నుండి రక్షణ కలిగిస్తాయన్నారు. బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని బిడ్డకు,తల్లికి అనుబంధం బలపడి బిడ్డ మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడునని తెలియజేశారు. బిడ్డకు పాలు పట్టే విధానం,జాగ్రత్తలు,చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రత్యామ్నాయ ప్రచార మాధ్యమాలకు ఆకర్షితులు కావద్దని ఇవి పిల్లల పోషకాహార నియమాలను ప్రభావితం చేస్తాయన్నారు. ఈ నెల 1 నుండి 7వ తారీఖు వరకు వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తల్లి,బిడ్డ ఆరోగ్య వివరాలపై తెలుసుకొని అక్కడ నిర్వహించిన సంచార చికిత్సా వైద్య తనిఖీల వివరాలపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చింతపల్లి : తల్లిపాలే శిశువులకు శ్రీరామరక్ష అని అంగన్వాడీలు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నవరం సెక్టార్ సూపర్వైజర్ ఎం లక్ష్మి సూచనల మేరకు అన్నవరం వారపు సంతలో అంగన్వాడీలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు తల్లి పాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు, శిశువు జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు త్రాగించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త కే శాంతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అన్నారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లి ముర్రు పాలు త్రాగించాలన్నారు. ముర్రు పాలు శిశువుకు మొదటి టీకా అన్నారు. ముర్రుపాలు వలన శిశువులకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగమణి, పూర్ణిమ, ముత్యాలమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ధ్యేయం : కంబాల

డ్రాలో గెలిపోందిన 70 మంది మహిళలకు బంగారు రూపులు పంపిణీ

విశాలాంధ్ర-రంపచోడవరం : మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నానని, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరం గ్రామంలోని రంపరోడ్డులో ఉన్న బాను కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక -3 లక్కీ డ్రా విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి రంపచోడవరం తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది గా మహిళలు తరలి వచ్చారు. తొలుత కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వాలన చేసి, లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ లక్కీ డ్రా లో గెలుపొందిన 70 మంది మహిళలకు ఉచితంగా బంగారు రూపులను కంబాల శ్రీనివాసరావు దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కృషి చేస్తానన్నారు. రామసేన సంస్థ ద్వారా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆలయాల అభివృద్ధి, ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, రామసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, ఆచ్చారావు, పసల గణేష్, దేశాల నరేష్, మందపాటి సతీష్, ఎం. శ్రీనివాసరావు, ఎ. వెంకటేశ్వరావు, నల్లమిల్లి రామారెడ్డి, రాయపాటి సత్తి బాబు, కే. సుధా, గుడ్ల అంక శ్రీనివాసరావు రెడ్డి, ముల్లి నాగమణి, జోన్నలగడ్డ నాగ వెంకట సత్యనారాయణ, పి. వెంకట లక్ష్మి, పింజర్ల నాగవీర భద్రరావు, కరణం కోటేశ్వరరావు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో ఏ-గ్రేడ్ మోడల్స్

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని పెదబొండపల్లి వరిలో ఏ గ్రేడ్ మోడల్ వరిపొలంలో 0.10 సెంట్లుగట్టు వెడల్పు చేసుకుని అంతరపంటలుగా కంది, బెండ, చిక్కుడు, వంగ, మిరప, అరటి, తోటకూర, గోంగూర, సుమారు పది రకాలు పంటలు వేసుకుని అధిక ఆదాయం సంపాదిస్తున్న రైతులు యాద్రాపు అప్పలనాయుడు, సోదరపు ధనుంజయ్, యాద్రాపు స్వామి నాయుడు ప్రధాన పంటకు అయిన ఖర్చు పోను ఇంటికి సంవత్సరం పాటు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తింటున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం చేయటం వలన లాభాలు నిరంతరం వస్తుందని, ఆరోగ్యం బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నుంచి ఎన్ఎఫ్ఎ టీమ్ రాజారావు ఎన్ఎఫ్ఎ జి. అన్నపూర్ణ, మండల ఇంచార్జీ ఎన్. రవణమ్మ, యూనిట్ ఇంచార్జి కర్రి సౌజన్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాలో పాల్గొనవద్దు : ఆటో డ్రైవర్లకు సిఐ పిలుపు

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు లోని ఆటో డ్రైవర్లకు సిఐ గోపాలకృష్ణ, ఎస్సై పి రమేష్ గంజాయి రవాణా గూర్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. చింతూరు పోలీస్ స్టేషన్లో సోమవారం మండలంలోని ఆటో డ్రైవర్లను పిలిపించి గంజాయి రవాణా పై కౌన్సిలింగ్ ఇచ్చారు. గంజాయి రవాణా చేయటం,సేవించడం, దాచి ఉంచటం, వ్యాపారస్తులకు సహకరించడం, పైలెట్ గా వ్యవహరించడం నేరమని అలాంటి విషయాల్లో జోక్యం చేసుకోవద్దని, గంజాయి నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ సీట్లో ఉన్నప్పుడు యూనిఫామ్ ధరించాలని అన్నారు. అంతేకాక ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోకు సంబంధించిన సి బుక్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్ ఈ సర్టిఫికెట్లు లేని వాహనాలను జప్తు చేస్తామని సీఐ హెచ్చరించారు. అలాగే, అధిక స్పీడ్ అన్నిటికీ అనర్థమని, ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సి వస్తుందని, అధిక స్పీడు వెళ్లినా కేసులు తప్పవని, పరిమితికి మించి వాహనంలో ప్యాసింజర్ ని ఎక్కించరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏలో ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని సీతంపేట, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, ఐటిడిఏ పరిధిలోని నాలుగు మండలాల గిరిజన ప్రజలతో లిసీతంపేట ఐటిడిఏలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఆగస్ట్ 9వ తేది ఉదయం 10 గంటలకులి ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సీతంపేట ఐటిడిఏ పరిధిలో ఉన్న 16 మండలాల గిరిజన ప్రజలతో లిపాతపట్నంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఆగస్ట్ 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకులి ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పండుగను గిరిజన ఆచార, సాంప్రదాయాలు, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన కళాకారులతో గిరిజన నృత్యాలను, గిరిజన వేషధారణలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కావున సీతంపేట, ఐటిడిఏలో నిర్వహించే ప్రవంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవో కోరారు.అదే విధంగా పాతపట్నంలో నిర్వహించే ప్రవంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటిడిఏ పరిధిలోగల 16 మండలాలకు చెందిన గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవో కోరారు.

స్పౌజ్ పెన్షన్లు వితంతువులకు ఆర్థిక రక్ష

సర్పంచ్ సన్యాసిరావు, ఎంపీటీసీ సూరిబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ లో భాగంగా నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లు వితంతువులకు ఆర్థిక రక్ష అని అన్నవరం సర్పంచ్ పాంగి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు, వైకాపా సీనియర్ నాయకుడు సుంద్రు చిన్నబ్బాయిలు అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నవరం పంచాయతీ పరిధిలోని నలుగురు వితంతువులకు నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ లను స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆర్ సింహాద్రి నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమంత్ లతో కలిసి గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులకు సోమవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భర్తలను కోల్పోయిన వితంతువులకు స్పౌజ్ పెన్షన్లు ఆర్థిక రక్ష అన్నారు. కుటుంబ యజమాని లేకపోవడం వలన మహిళలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందుని పెన్షన్ పంపిణీ రూపంలో కాస్తయినా తగ్గించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇటువంటి పథకాలు నిర్భాగ్యులకు నిజమైన ఆర్థిక భరోసా అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-సీతానగరం : లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్ తేజేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని మరిపివలస షిర్డీసాయి ఇంజనీరింగ్ కళాశాల వద్ద పాఠశాల హెచ్ఎంలకు జిల్లా స్థాయి లీడర్ షిప్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెయ్యడం, పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం కోర్సు డైరెక్టర్ సామల సింహాచలం మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే లీడర్షిప్ ట్రైనింగ్ అంశాలను మాస్టర్ ఫెసిలిటేటర్లు వివరిస్తారని, వీటిని పాఠశాలల్లో అమలు చేయాలని, నూతన విద్యా విధానాలను విద్యార్థులకు అందించాలన్నారు. ఈకార్యక్రమంలోఏఎంఓ జి కోటేశ్వరరావు, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ చొక్కాపు శ్రీనివాసరావుతో పాటు రెండు వందల మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నట్లు కోర్స్ డైరెక్టర్ సామల సింహాచలం తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 138 అర్జీలను స్వీకరించగా ఐటిడిఎ పిఓ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ కె. హెమలత, కెఆర్ఆర్సీ ఎస్డీసీ పి. ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ పిడి ఎం. సుధారాణి భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేస్తారని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థ వంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తారన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించి ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

ఆర్.బి.ఎస్.కె పిఓ డాక్టర్ జగన్మోహన్

విశాలాంధ్ర-బెలగాం : పిల్లలు, విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించి ఆరోగ్య పరమైన సమస్యలు, లోపాలు సకాలంలో గుర్తించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. సీతానగరం మండలం కె. వెంకటాపురం (కె.డి వలస) లో అంగన్వాడీ కేంద్రం, హెల్త్ వెల్నెస్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పిల్లల హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎంత మంది అంగన్వాడీ పిల్లలు, స్కూల్ విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు, ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారు, వైద్యాధికారి నిర్ధారణ చేసినవి, ఇంకా ఎంత మందికి స్క్రీనింగ్ చేయాలి పెండింగ్ వివరాలు, ఆన్లైన్ నమోదు తీరు పరిశీలించారు. ఆరోగ్య వివరాల రికార్డులు తనిఖీ చేశారు. హెల్త్ స్క్రీనింగ్ లో 4డి గుర్తించడంపై దృష్టి సారించాలని వ్యాధులు, శారీరక, మానసిక లోపాలు, వైకల్యాలు, ఆరోగ్య సమస్యలు సకాలంలో గుర్తించి తగు చికిత్స కొరకు కార్యాచరణ చేయాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సూచిస్తూ, జ్వరలక్షణాలతో గ్రామంలో ఎవరైనా ఉన్నారా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెల్నెస్ కేంద్రంలో మందుల లభ్యతపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంధ్యారాణి, జయలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది ప్రియాంక తదితరులు ఉన్నారు.

సమస్యలపై యం.డి.ఓ.ని కలిసిన జనసేన మండల పార్టీ నాయకులు

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు పంచాయతీ సమస్యలపై చింతూరు యం.డి.ఓ.ని కలిసి సమస్యలు గురించి వివరించారు. కాలనీలో రోడ్లు మొత్తం బురద మయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే చాలా చోట్ల వీధి లైట్లు పాడైపోయి వెలగడం లేదని తెలియజేశారు. డ్రైనేజీలు మట్టితో కూరుకుపోయి వాటిని వెంటనే పూడికతీత తీయంచి బ్లిచింగ్ కోట్టించి దోమల మందు పిచికారి చెయించాలని వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మడివి రాజు మండల ఉపాధ్యక్షులు చిలకం కన్నరావు, సీనియర్ నాయకులు పయ్యాల నాగేశ్వరావు తీగల రవి మండల నాయకులు మల్లిపూడి సతీష్ షేక్.సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం

విశాలాంధ్ర-పార్వతీపురం : పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రతీ సోమవారం పిజిఆర్ఎస్ కు ఎంతో మంది అర్జీదారులు వ్యయ ప్రయాసల కోర్చి చాలా దూరం నుండి వస్తుంటారని అన్నారు. అర్జీదారుల సౌకర్యార్థం దాతల సహకారంతో ప్రతీ సోమవారం సుమారు 500 మంది అర్జీదారులకు ఉచితంగా భోజనం సదుపాయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ అర్జీదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో అర్జీదారులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తూ అర్జీదారులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ మంత్రి పర్యటనలో గిరిజన సహకార సంస్థ చైర్మన్' గైర్హాజరు

అందుకేనేమో ఆ డైరెక్టర్లను దూరం పెట్టిన మంత్రి

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు పర్యటనలో బాగంగా సోమవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముందుగా విశాఖ పట్నం నుంచి బయలుదేరి రోడ్ల మార్గాన మోదకొండమ్మ ఘాట్ రోడ్డు గుండా పాడేరు చేరుకోనుండగా ముందుగా అమ్మ వారి పాదాలులో దర్శించుకొన్నాకా మినుములూరు డి ఆర్ డిపో ను సందర్శించాల్సి ఉండగా వాస్తవానికి ఈ కార్యక్రమానికి కర్త కర్మ క్రియ ప్రోటోకాల్ దగ్గ రుండి గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ చూసుకోవాల్సి ఉన్నపటికీ ఒక రాష్ట్ర మంత్రి అందులో పౌర సరఫరా శాఖ మంత్రి పర్యటనకు వస్తున్నారని తెలిసే గైర్హాజరు అయ్యారా...? లేక కావాలని మరో చోట వెళ్ళరా అని అందరూ ప్రశ్నించుకొన్న సందర్భం ఎక్కువగా అక్కడ కనిపించిన పరిస్థితి నెలకొంది. దానికి తోడు గిరిజన సహకార సంస్థ కు చెందిన డైరెక్టర్ లను పౌర సరఫరా శాఖ మంత్రి కనీసం దగ్గరకు కూడా రానివ్వక పోవడం చర్చంసనీయం అయింది. ఒకింత బిజెపి పెద్దలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారనడంలో సందేహమే లేదని చెప్పకతప్పదు.జి సి సి చైర్మన్ కనిపించకపోవడం కాదుగాని పెద్ద చర్చ కు దారి తీసి హాట్ టాపిక్ గా మారింది. ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వ కార్యక్రమాలన్నీ కలిసికట్టుగా చేస్తున్నప్పటికీ అరకు పాడేరు నియోజకవర్గాలకి వచ్చేసరికి అధికార మంత్రులు పర్యటనకు వస్తే మాత్రం కేవలం ఆ పార్టీకి చెందిన వారు మాత్రమే పాల్గొని కార్యక్రమాలు చేయడం కొసమెరుపుగా ఉండడం విశేషంగా భావించవచ్చు. మొన్నటికి మొన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, గిరిజన ప్రాంతంలో పర్యటనకు వచ్చినప్పుడు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మాత్రమే అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బిజెపి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అంటీ అంటనట్లుగా వ్యవహరించారు. అదే మాదిరిగా సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీకి చెందిన వారు కావడంతో అధిక సంఖ్యలో జనసేన నాయకులు కార్యకర్తలు అధి సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ముందుండి నడిపించడం జరిగింది. ఇదే ఆచార్యానికి గురి చేస్తుందంటే గిరిజన ప్రాంతంలో కూటమి నాయకులకు సౌఖ్యత లేదని భావించవచ్చా?

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడం గొప్ప విశేషం

విశాలాంధ్ర-కొమరాడ : రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల్లో తల్లడిల్లుతున్న వేళ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చాలా కష్టతరం విషయం అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా ఒక్కొక్క పథకం అమలు చేస్తుందని టిడిపి అరుకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని విక్రామపురం గ్రామంలో తన నివాసం వద్ద విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సమయంలో రాష్ట్రం ఆర్థికంగా అప్పులు ఊబిలో కూరుకుపోయి ప్రజలు అనేక అవస్థలు పడే ఇబ్బందులు పడిన పరిస్థితి గుర్తు చేశారు. ప్రజలను అభివృద్ధి సంక్షేమం రెండు కన్నుల వలె కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పాలన కొనసాగిస్తుందని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఇద్దరు రాష్ట్రానికి రెండు కళ్ళు వలె సంక్షేమ పాలన అందిస్తూ రాష్ట్ర అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ లో భాగంగా ఒక్కొక్క పథకాన్ని అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని అన్నారు. దీనిలో భాగంగా గత రెండు రోజుల క్రితం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో అర్హులైన రైతులందరికీ 7వేల రూపాయలు నగదును జమచేసి ఖరీఫ్ సీజన్కు పెట్టుబడి సహాయం కింద అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం విడుదల సందర్భంగా వారం రోజులు పాటు వివిధ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు రోజులు కార్యక్రమాలు చేశామని మంగళవారం తెలుగు రైతు కమిటీ సభ్యులు అన్నదాత సుఖీభవ గురించి ప్రెస్ మీట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బుధవారం తెలుగు రైతు కమిటీ సభ్యులు అన్నదాత సుఖీభవ గురించి ఇతర రైతులతో మాట్లాడించి వారి అభిప్రాయాలను వీడియోలు తీసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది అని తెలిపారు. గురువారం తెలుగు రైతు కమిటీ సభ్యులు ప్రతి గ్రామంలోని రైతుల వద్దకు వెళ్లి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల గురించి చర్చించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు అమలు చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ముందుకు వెళ్లడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అని అన్నారు. ఈ సమావేశంలో కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొట్టాపు త్రినాథం రైతులు తదితరులు ఉన్నారు.

సకాలంలో ఐటీడీఏ గ్రీవెన్స్‌కు వచ్చిన వినతులు పరిష్కరించండి : ఐటీడీఏ పివో

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటీడీఏలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 36 మంది వినతి పత్రాలను సమర్పించారు. సీతంపేట మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన సవర మోహన్ తమ గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని, జగ్గడుగూడ గ్రామానికి చెందిన సవర జయమ్మ డైరీ ఫారం మంజూరు చేయాలని, జలుబుగూడ గ్రామానికి చెందిన సన్నాయి టార్పాలిన్ మంజూరు చేయాలని, భామిని మండలం పాలిష్ కోట గ్రామానికి చెందిన బిడ్డిక సొంజిమిత్ర తల్లికి వందనం పథకం డబ్బులు ఇప్పించాలని, బుడ్డడుగూడ గ్రామానికి చెందిన సవర లక్ష్మి తనకు కుట్టుమిషన్ ఇప్పించాలని, బూర్జగూడ గ్రామానికి చెందిన సవర ఈశ్వరి సవర బాషా వాలంటీర్ ఉద్యోగం ఇప్పించాలని, పాతపట్నం మండలం గురండి గ్రామానికి చెందిన తణుకు నాగరాజు తనపై నమోదైన డీఎల్ఎస్‌సీ కేసు విచారణను పూర్తి చేసి తనకు ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని, పాతపట్నం మండలం సంతోషపురం గ్రామానికి చెందిన అల్తి జోత్స్న అనారోగ్యం నిమిత్తం ఖర్చు అయిన మెడికల్ బిల్లును ఇప్పించాలని, నందిగాం మండలం పెద్ద గురువూరు గ్రామానికి చెందిన పెద్దింటి జానకిరావు తన ఇల్లు అగ్నిప్రమాదం వలన కాలిపోయినదని, కావున నష్టపరిహారం ఇప్పించాలని, భామిని మండలం నూకాలమ్మగూడ గ్రామానికి చెందిన సవర కుమార్ తమ గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను మార్చాలని, హిరమండలం మండలం బొండిగూడ గ్రామానికి చెందిన సుబ్బారావు గ్రామానికి సామాజిక భవనం మంజూరు చేయాలని వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ కుమార్, డిప్యూటీ డీఈవో రామ్మోహన్రావు, ఉపాధి హామీ ఏపిడి శ్రీహరిరావు, వెలుగు ఏపిడి సన్యాసిరావు, పీహెచ్ఓ గణేష్, ఏఎంవో కోటిబాబు, ఎస్సై అమ్మానరావు ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులో తల్లిపాల వారోత్సవాల జాడేది..?

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : స్థానిక శిశు స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టులో నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది. గత కొద్దిరోజులుగా ప్రాజెక్టులో సిడిపిఓగా విధులు నిర్వహించే అధికారి జాడ లేకపోవడంతో క్రింది స్థాయి సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరు పిఓగా వస్తారో....? అన్న సందిగ్ధం నడుమ ప్రాజెక్ట్ లో ఒకరికొకరు ఎవరికి వారు ఏమన్న తీరు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీని మూలంగానే ఈ నెల ఒకటో తేదీ నుంచి వారం రోజులు పాటు ఘనంగా నిర్వహించాల్సిన తల్లిపాల వారోత్సవాలు జాడ లేకుండా పోయింది. పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో మున్సిపాలిటీతో పాటు మండలం వర్తిస్తుంది. మున్సిపాలిటీలో అక్కడక్కడ అంగన్వాడి కేంద్రాల్లో నామమాత్రంగా గర్భిణీలకు తల్లిపాల ఆవశ్యత గురించి వివరిస్తూ కార్యకర్తలు అవగాహన కల్పిస్తారు. మండల విషయానికి వస్తే సూపర్వైజర్లు నచ్చినట్లు వ్యవహరించి వారోత్సవాలను నిర్వహించకుండా గాలికి వదిలేసారు. ఉన్నతస్థానంలో ఉండి క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కేంద్రాల పనితీరును కార్యకర్తల జీతభత్యాలు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం గర్భిణీలకు ఇస్తున్న హెూం రేషన్ వాటిని పరిరక్షించాల్సిన పిఓ లేకపోవడంతోనే ఇదంతా జరుగుతుందని పలువురి వాదన. ఏది ఏమైనా మండల విషయంలో పెదబొండపల్లి సెక్టారు బందలుప్పి, నర్సిపురం, మరికి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా వీటికి నామమాత్రంగా అయినా తల్లిపాల వారోత్సవాల గురించి అవగాహన కల్పించలేదంటే సందేహం అక్కర్లేదు. బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలు తప్పనిసరిగా త్రాగించాలని, తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి సహజ టీకా. ఇందులో ఉండే ప్రోటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్లు, ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వవస్థ బలపడటానికి ఎంతో దోహదపడతాయి, వ్యాధుల నుండి రక్షణ కలిగిస్తాయి. బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని బిడ్డకు, తల్లికి అనుబంధం బలపడి బిడ్డ మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడుతుంది. బిడ్డకు పాలు పట్టే విధానం, జాగ్రత్తలు, చేతుల పరిశుభ్రతపై గర్భిణీలకు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తల్లిపాల ప్రత్యామ్నాయ ప్రచార మాధ్యమాలకు ఆకర్షితులు కావద్దని ఇవి పిల్లల పోషకాహార నియమాలను ప్రభావితం చేస్తాయి. ఈ నెల 1 నుండి 7 వ తారీఖు వరకు వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ఇన్ని ఉపయోగాలు తల్లిపాల వల్ల ఉన్నప్పటికీ వాటిని అవగాహన కల్పించడంలో మాత్రం స్థానిక ఐసిడిఎస్ అధికారులు ఘోరంగా విఫలం అయ్యారనే చెప్పాలి.

అసత్య, అబద్ధ పాలన : మాజీ ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పోయిందని త్వరలో చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని, ప్రజలకు అసత్య హామీలిచ్చి గద్దెనెక్కిన వెన్నుపోటు నాయకుడు చంద్రబాబు నేటికీ హామీలపై స్పష్టత లేదని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. రాష్ట్ర ప్రజలు తీవ్ర వ్యతిరేకత, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మరికొద్ది రోజుల్లో ప్రజలే స్వచ్ఛందంగా ప్రభుత్వంపై ఆందోళన చేస్తారన్నారు. వైయస్సార్సీపి రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న ఇంటికో వంచన కార్యక్రమం సోమవారం మండలంలోని నర్సిపురం మేజర్ పంచాయతీలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడుతూ గడిచిన ఏడాదిన్నరగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసారని, రాష్ట్రాన్ని అబద్ధాల పుట్టగా మార్చారని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ రోజులు గడుపుతున్నారని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది నెలల్లో కూటమి యొక్క పాలన చూసి ప్రజలే రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తారని ఎద్దేవా చేశారు. వైయస్సార్సీపీ చేపట్టిన ఇంటికో వంచన కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఏడాదిలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత వచ్చిందంటే కూటమి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శోభారాణి, జడ్పిటిసి బలగ రేవతి, పార్టీ నాయకులు రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చు పురుగుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

వ్యవసాయ అధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట : పత్తి పంటలో ప్రస్తుతం పేనుబంక ఉధృతి అధికంగా ఉందని పేను బంక ఆకుల అడుగుభాగాన ఆశించి రసం పీల్చడం వలన పత్తి పంట బలహీనంగా మారుతుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు విశ్వనాథపురం గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అశ్విని లావణ్య తో కలిసి పత్తి పంటను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పత్తిలో ప్రశంపించు పురుగుల ఉధృతి అధికంగా అవుతుందని ప్రస్తుతం పత్తి పంటలో పేను బంక ఉధృతి అధికంగా ఉందని రైతులు పత్తి పంటపై నల్ల కండ చీమలు పాకడం చూసినట్లయితే పేను బంకగా గుర్తించాలని పెనుబంక ఉధృతంగా ఉంటే రసం పిలిచి ఆకుపై నల్లటి మసి పదార్థాన్ని ఏర్పరుస్తాయని దీనివలన పంటలలో కిరణజన్య సంయోగ క్రియ ప్రభావం తగ్గి పంట బలహీనంగా మారడం వలన దిగుబడి తగ్గుతాయని కాబట్టి ప్రశాంత్ పిలుచు పురుగుల %×అఎశ్రీబ౦వ౦% థయోమెతాక్జోమ్ లేదా ఎసిటమీప్రిడ్ లేదా ఇమిడా క్లోపరిడ్ లేదా ఫ్లోనికామిడ్ మందులలో ఒకదానిని 100 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పంట బాగా తడిచేటట్టు పిచికారి చేయాలని తెలిపారు. మెట్టవలసలో వరుసలలో వరి నాట్లపై శిక్షణ: వరుసలలో వరి నాట్లు వేసుకోవడం ద్వారా పంటలో గాలి వెలుతురు బాగా సోకుతుందని దీనివలన దోమపోటు ఉధృతి బాగా తగ్గుతుందని మొక్కల సంఖ్య సరిపడినంత ఉండడం వలన దిగుబడి బాగా పెరుగుతుందని తెలిపారు. ఆత్మ ఆధ్వర్యంలో వరి నాట్లపై రైతులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటూ కుదురుకు ఒకటి లేదా రెండు మొనలు మాత్రమే నాటాలని తేలికపాటి నాట్లు వేసుకోవాలని చివరలో తుంచి నాటడం ద్వారా కాండంతలు పురుగును గుడ్ల దశలోనే నివారించవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈఓ గణేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలి : వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్ : వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ జరుగుతున్న ప్రచారంలో భాగంగా సోమవారం పార్వతిపురం పట్టణంలోని మూడవ వార్డు వివేకానంద కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి వి రమణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి రంజిత్ కుమార్, సిఐటీయు నాయకులు గొర్లి వెంకటరమణ బి సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఎం గౌరమ్మ తదితరులు మాట్లాడుతూ కూటమి పెద్దలు అధికారంకి రాకముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఈ రకంగా భారాలు ప్రజలపై మోపడం సమంజసం కాదని అన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధాని స్మార్ట్ మీటర్లును వ్యతిరేకించి ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్ల ను ప్రజలకు అందగట్టేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు? ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, భవిష్యత్తు లో విద్యుత్ చార్జీల భారాలు ప్రజలపై మోపకుండా స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు.. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా మంగళవారం పార్వతీపురం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఈ ఆందోళనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అంగన్వాడీలపై యాప్‌ల భారం తగ్గించాల్సిందే...

సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : యాప్‌ల భారం తగ్గించాలని, అంతవరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులకు, సరిగ్గా పని చేయని సెల్ ఫోన్ లు మాకు వద్దని అంగన్వాడీలు సంబంధిత ఐ సి డి స్ పిఓ లకు ఆఫీసుకి కట్టకట్టి ఫోన్లు అందజేశారు. చాలా చోట్ల ఫోన్లు తీసుకోవడానికి ఐ సి డిఎస్ సిబ్బంది నిరాకరించినప్పటికీ అంగన్వాడీలు అంగన్వాడీ కార్యాలయాల ముందే భీష్మించి కూర్చున్నారు. ఐసిడిఎస్ పిఓ కార్యాలయ గదిలో కట్ట కట్టి ఉంచి ఫోటో తీసుకున్నారు. ఈ ఫోన్లు మాకొద్దు అంటూ అంగన్వాడీలు నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడిన చిన్నయ్య పడాల్ అంగన్వాడీలకు ప్రభుత్వం 5 యాప్ లు ఇచ్చి మానసిక క్షోభకు గురి చేస్తుందని మండిపడ్డారు. యాప్ ల కారణంగా, సంకేతాలు అందక అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించుకున్నా, పరిష్కరించడానికి ముందుకు రాలేదని మండిపడ్డారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఈ పోరాటం ఆగదని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ. ప్రాజెక్టు కార్యదర్శి రాములమ్మ, పెద్ది, గసాడి లక్ష్మి,. సత్యవతి, ఇందు,. ప్రసన్న, అంగన్వాళ్ళందరూ పాల్గొన్నారు.

ఆదివాసి నాయకపోడు సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ఈనెల 9న ఆదివాసి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో రేఖపల్లిలో నిర్వహించే ఆదివాసీ నాయకపోడు సమావేశాన్ని జయప్రదం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ నాయకుడు అధ్యక్షుడు చిక్కాల బాలకృష్ణ జీడి గొప్ప సర్పంచ్ ముట్ల బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం మండల నాయకులు జీడిగుప్ప సర్పంచ్ ముట్ల బాలరాజు అధ్యక్షతన ములకపల్లి గ్రామం లో శ్రీరామగిరి గ్రామపంచాయతీ శ్రీరామగిరి లో ఆత్మకూరి కాంతారావు ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం మీటింగ్ ఏర్పటు చేసుకోవటం జరిగినది ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ, మండల నాయకులు వెటకాని మల్లయ్య మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రేఖపల్లి లో భారీ ఎత్తున సమావేశం ఏర్పాటు చేయటం జరుగుతుందని, నాయకపోడు సాధక బాధలు, అలాగే మన జాతికి జరిగే అన్యాయం తదితర విషయాలపై సమావేశంలో చర్చించుట జరుగుతుందని, ఈ సమావేశానికి ఎటపాక, కూనవరం, వి ఆర్. పురం మండలం లోని నాయకపోడు అందరూ రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో నాయకపోడు సంఘం నాయకులు వెటకాని మల్లయ్య, కోశాధికారి కారి కొట్టి ముత్యాలరావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టి కన్నంరాజులు, మాజీ సర్పంచ్ బేతి నాగేశ్వరావు, వార్డు సభ్యులు బేతి తిరుపతి రావు, బేతి సరయ్య,చింతకాయల భవాని, వెటకాని సురేష్ బేతి రాజు, బేతి వీరబాబు, వెటకాని బాలు, గంగుల నరేష్, ములకలపల్లి కమిటి సభ్యులు పెద్దలు యడ్ల సూర్యం, యడ్ల సత్యనారాయణ, యడ్ల లక్ష్మానరావ్,యడ్ల రమణారావ్, వార్డ్ లు ముట్ల అర్జున్,సారా రాజు శ్రీరామగిరి కమిటి సభ్యులు ముత్యాల పోసిబాబు, వనం శ్రీహరి, శివుడు ఏసుబాబు, గడ్డం రాజకుమార్ గడ్డం రఘు ముత్యాల సత్యనారాయణ వనం కార్తీక్,గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల నీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర కథనానికి విశేష స్పందన

విశాలాంధ్ర-చింతపల్లి : సోమవారం గ్రామస్తుల నీటి సమస్య పరిష్కరించండి అనే విశాలాంధ్ర కథనానికి విశేష స్పందన వచ్చింది. అన్నవరం పంచాయతీ సోమవరం గ్రామంలో మరమ్మతులకు గురైన నీటి పథకాలకు మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామస్తుల నీటి సమస్య పరిష్కరించాలన్న గురువారం ప్రచురితమైన విశాలాంధ్ర కథనానికి స్పందించిన ఆ పంచాయతీ కార్యదర్శి ఆర్ సింహాద్రి నాయుడు ఎట్టకేలకు ఆ గ్రామంలో మరమ్మలకు గురైన నీటి పథకాలకు మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో సోమవరం గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం లభించినట్లు అయిందని ఆయన తెలిపారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోండి

- తల్లి పలు ముద్దు... డబ్బా పాలు వద్దు అనే సూక్తిని ఆచరించండి
- ఐసిడిఎస్ లంబసింగి సెక్టార్ సూపర్వైజర్ సౌజన్య

విశాలాంధ్ర-చింతపల్లి : శిశువులకు తల్లి ముర్రుపాలు తొలి టీకా గా భావించి బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లి ముర్రు పాలు త్రాగించాలని ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ జి సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం లంబసింగి సెక్టార్ లోని చిత్రాల గొప్పు అంగన్వాడి కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల యొక్క ప్రాధాన్యతను గర్భవతులు, బాలింతలకు వివరించారు. శిశువులకు వ్యాధి నిరోధక శక్తి తల్లి పాల ద్వారానే సంక్రమిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామస్థాయిలో గర్భవతులకు వివరించాలని ఆమె అంగన్వాడీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎరువులు ఎక్కడ...?

సచివాలయం ఎదుట రైతుల అవస్థలు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా ఎరువులను అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతలకు ఎరువుల తిప్పలు తప్పడం లేదని, ఎరువుల కోసం రైతులు పొలం పనులు మాని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రామస్వామి అన్నారు. మండలంలోని సంగంవలస పంచాయతీ పరిధిలో గల సచివాలయ కేంద్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, ఖరీఫ్ సీజన్ కు రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నాయని వాస్తవానికి ఎరువులు ఎక్కడ ఉన్నాయని సోమవారం ఆయన ప్రశ్నించారు. రైతులకు అవసరమైన యూరియా, డిఎపి, పొటాషియం వంటివి అందడం లేదని కేవలం ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప అవి క్షేత్రస్థాయిలో మాత్రం నిజం కాదని మండిపడ్డారు. దీని మూలంగా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు ఎరువులు కొనుక్కోవలసిన పరిస్థితి నెలకొందని, యూరియా 450 రూపాయలు కాగా, డిఎపి 1600 రూపాయలకు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని ఇదంతా వ్యవసాయ శాఖ అధికారులకు తెలిసే జరుగుతుందని ఆరోపించారు. రైతుల డిమాండ్ మేరకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని లేదంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-కురుపాం : జర్నలిస్టుల సమస్యలు పరిసరించాలని కోరుతూ సోమవారం కురుపాం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహశిల్దార్ కె. జయ కు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘ నాయకులు మాట్లాడుతూ ఇంటి స్థలాలు మంజూరు, పెన్షన్ అక్రిడేషన్ కార్డులు జారీ, జర్నలిస్ట్ కమిటీలు, అవార్డులు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులో ఎన్. శ్రీనివాసరావు, జి.వెంకటరావు, జి. డిల్లీశ్వరరావు, డి. ప్రదీప్, ఎం. పృథ్వి, డి. మణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు పంపిణీ

టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి

విశాలాంధ్ర-కొయ్యూరు : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ రైతాంగానికి వివిధ రకాల మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు బోనంగి సత్యవతి తెలిపారు సోమవారం డౌనురులో రైతులకు వివిధ రకాల మొక్కలు అందజేశారు ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులందరికీ ప్రయోజనం కలిగే విధంగా జామ మామిడి కొబ్బరి సపోటా సీతాఫలం వంటి మొక్కలను రైతులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు అలాగే ఈ మొక్కలు నాటిన రైతులందరికీ వాటి సంరక్షణకు ఉపాధి హామీ పథకం ద్వారా డబ్బులు కూడా ఇస్తారని ఆమె తెలిపారు. వీటిని వ్యవసాయ రైతులు పూర్తిస్థాయిలో సమర్షించి ఆర్థికంగా నిలదొక్కు కోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షురాలు గోలిదేవి సీనియర్ నాయకులు రీమల జగన్, రైతులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 79.94శాతం సుపరిపాలన తొలి అడుగు పూర్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు మేరకు పార్వతీపురం నియోజకవర్గంలో సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 79.94శాతం విజయవంతంగా పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు.నియోజక వర్గంలో కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఆయా గృహాలను సందర్శించి ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు మిగిలిన గృహాల సందర్శన కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేసి నూరు శాతం లక్ష్యం పూర్తిచేయాలని టీడీపీ శ్రేణులను కోరారు. మూడు మండలాల్లో, పురపాలక సంఘంలో మిగిలిన లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

ఐవిఆర్ఎస్ సర్వేలో శతశాతం సంతృప్తికరంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరగాల్సి ఉందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అర్జీదారుల సమస్యలు పరిష్కార విషయమై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం చేసే సర్వేలో శతశాతం సంతృప్తికరంగా ఉన్నట్లు అర్జీదారుల స్పందన ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్నా, సంతృప్తికరంగా లేకపోయినా, ఐవిఆర్ఎస్‌లో శతశాతం సంతృప్తి చెందకపోయిన సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. వచ్చిన ప్రతీ అర్జీకి జిల్లా అధికారి కచ్చితంగా ఎండార్స్ మెంట్ ఇవ్వాలని, అనంతరం అర్జీదారునితో స్వయంగా మాట్లాడి అర్జీపై తీసుకున్న చర్యలు గురించి వివరించాలన్నారు. వచ్చిన ప్రతీ అర్జీని రిజిష్టర్లో నమోదు చేసి ఫైళ్లను నిర్వహించాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి పీజీఆర్ఎస్, పీ4, పీఎం సూర్యఘర్, ఈపీటిఎస్ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పీఎం సూర్యఘర్ పై సమీక్షిస్తూ ప్రతీ ఏఈ కూడా వారి పరిధిలో గల ఎస్సీ వినియోగదారుల ఇళ్లను ఎంపీడీఓలతో సందర్శించి సూర్యఘర్ పై అవగాహన కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వివరించాలని తెలిపారు. ప్రతీ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈపీటిఎస్ (ఎలక్ట్రానిక్ పెర్ఫార్మన్స్ ట్రాకింగ్ సిస్టం) ద్వారా ప్రతీ శాఖలోని రికార్డులు, జీఓలను స్కానింగ్ చేసి అప్లోడ్ చేయాలని చెప్పారు. అప్లోడ్ విషయంలో జిల్లా వెనుకంజలో ఉండటానికి వీల్లేదని, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వీలైనంత త్వరగా అప్లోడ్ చేయాలని తెల్చి చెప్పారు. పీ4పై కలెక్టర్ సమీక్షిస్తూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శిల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తల వివరాలు తీసుకొని, వారితో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. పీ4 పై ఆసక్తి గల మార్గదర్శిలను ఎంపిక చేసి, ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెసి ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓలు అశుతోష్ శ్రీవాస్తవ, సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ కె. హేమలత, ఎస్డీసీలు పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్. దిలీప్ చక్రవర్తి, డిఆర్డిఏ పీడీ ఎం. సుధారాణి, డీఈఓ. బి. రాజకుమార్, డిఐఈఓ వై. నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్. తేజేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ కె. మల్లికార్జునరావు, డిఎంహెచ్ఓ డా. ఎస్. భాస్కరరావు, డీఏహెచ్ఓ డా. ఎస్. మన్మథరావు, డీబీసీడబ్ల్యూఓ ఇ. అప్పన్న, డీ.ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇఓ ఓ.ప్రభాకరరావు, సీడీపీఓ జి. శాంతిభవాని, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు ఎండగడదాం!

- చంద్రబాబు చేసిన మోసాలు ప్రతి గడపకు చేరవేయాలి!
- 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'లో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర-జి.కె.వీధి : జీకే వీధి మండల నాయకులు నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' సోమవారం మండల స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చంద్రబాబు ఇచ్చిన హామీలు చేసినా మోసాలు వైఎస్ఆర్సిపి నాయకులందరూ ప్రతి గడపకు వెళ్లి నాడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జగనన్న ప్రజలకు ఏం మేలు చేశారో ఈ కూటమి ప్రభుత్వం చంద్రబాబు ఎన్నికల ముందు మేనిఫెస్టో పెట్టి ఏం చేసారు. అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న కావాలని కోరుకుంటున్నారని, జగనన్న ప్రజల్లోకి వెళ్తే లక్షలాది మంది తన వెంట వస్తుంటే ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక ఈ కూటమి ప్రభుత్వం నాయకులపై చేస్తున్న దాడులు, తప్పుడు కేసులు పెట్టి అరాచకాలు చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగం పరిపాలిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ బలోపేతం చెయ్యడానికి నాయకులందరూ ఏకమై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులందరికీ శాసనసభ్యులు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ కొర్ర సుభద్ర, ఎంపీటీసీ కొర్ర రాజులమ్మ, జల్లి సుధాకర్, బిడిజన అప్పారావు, కుందేరి రామకృష్ణ, మచ్చేల మత్యరాజు, వసుపరి తిమోతి, కంకిపాటి రామారావు, మండల ఉపాధ్యక్షులు వంతాల అరుణ్ కుమార్, మండల కార్యదర్శులు వంతాల చంటిబాబు, బాలకృష్ణ, కె శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై తప్పుడు నిందలు వేస్తే తాటతీస్తాం

డౌనూరు పంచాయితి గ్రామ కమిటీ అధ్యక్షురాలు గోలి దేవి

విశాలాంధ్ర-కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు పంచాయితి ఉసిరికపాడు రోడ్డు గత వైసిపి గవర్నమెంట్ లో ఇప్పుడున్నటువంటి సర్పంచ్ పొట్టిక భవాని ఆమె భర్త వైసిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి పొట్టిక పోతురాజు లక్షల రూపాయలు కమిషన్లుగా తీసుకొని తీర్మానం ఇచ్చింది మీరు కాదా మీకు తెలియకుండా రోడ్డు కాంట్రాక్ట్ కు ఎవరు తీర్మానం ఇచ్చారు అని డౌ నూరు పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు గోలి దేవి ఆరోపించారు. డౌనూరు పంచాయితి తులబాడ గడ్డ గ్రామంలో 12 లక్షల రూపాయలు చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు మంజూరు అయితే కమిషన్లకు కక్కుర్తి పడి ఇప్పటి వరకు తీర్మానం ఇవ్వకుండా ఆప్ చేసిన వ్యక్తి ఈ సర్పంచ్ పొట్టిక భవాని ఆమె భర్త పోతురాజు అని అన్నారు. మండలంలో శాంక్షన్ అయిన చెక్ డ్యామ్ లు అన్ని పంచాయతీల్లో పనులు పూర్తి అయినవి కానీ ఒక్క డౌనూరు సర్పంచు వల్ల పనులు నిలిచిపోతున్నాయి దీని మీద తగు విచారణ చేయాలని అధికారులను కోరుచున్నట్లు గోలి దేవి తెలిపారు.

కమెండో జీపుల్లో 5వ తేదీలోగా ఇంటివద్దకే డెలివరీ

- 69 సబ్ డిపోలు ఏర్పాటు
- పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఒకటి రెండు కిలోమీటర్ల దూరం ఉన్న లబ్దిదారులకు కమెండో జీపుల్లో 5వ తేదీలోగా ఇంటివద్దకే నిత్యావసర సరుకులు అందజేయడం జరుగుతుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) పర్యటనలో పాడేరు మండలం మినుములూరులో డిఆర్ డిపో, అలాగే సుంద్రుపుట్టులో మండల స్థాయి గోదాములు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో పౌరసరపరాల శాఖ, గిరిజన కార్పోరేటివ్ వ్యవస్థ నుంచి ప్రతి గ్రామంలో రేషన్ అందుతుంది అనే అంశంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయడం కోసం ఈ పర్యటన అన్నారు. రాబోయే రోజుల్లో ఈ వ్యవస్థను ఇంకొంచెం ప్రక్షాళన చేసి ఆధునీకీకరణ ఆలోచనతోటి తప్పకుండా వీళ్ళందరూ కోరినట్టు వాళ్ళకు కావలసిన నిత్యావసర సరుకులు ఇక్కడే తక్కువ ధరకు అందించడానికి కావలసిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకటి రెండు కిలోమీటర్ల దూరం ఉన్న లబ్దిదారులకు కమెండో జీపుల్లో పద్ధతి ప్రకారం అందజేయుటకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎండిఓ వాహనాల ద్వారా పూర్తి స్థాయిలో పంపిణి సక్రమంగా జరగలేదని, ఎక్కడో ఒక్క చోట కొంత సమయం అందుబాటులో ఉంచేవారని ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అయ్యారన్నారు. షాప్ ల ద్వారా పంపిణి చేయడం వలన 1వ తేదీ నుండి 15వ తేదీలోగా వెళ్లి తెచ్చుకోవచ్చని, ఈ అవకాశాన్ని అందరికి సంతృప్తికరంగా మార్పును హర్షిస్తున్నారన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఉన్నా వాటిని పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా పౌర సరఫరాల అధికారి బి మోహన్ బాబు, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, సిఎస్డిటి ప్రశాంత్, పౌర సరఫరాల అధికారులు సిబ్బంది ఉన్నారు.

గ్రామాలవారీగా రైతు సదస్సులు

విశాలాంధ్ర-జి.మాడుగుల : ఈనెల 5వ తేదీ నుంచి వ్యవసాయ లిరైతు సదస్సులులి నిర్వహించడం జరుగుతుందని జి.మాడుగుల ఏవో కె.వరప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు నెలల పాటు గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు, పిసా కమిటీ సభ్యులు, కూటమి నేతలు, రైతు సంఘాలు, రైతులు తప్పనిసరిగా గ్రామాల్లో జరిగే సదస్సులకు హాజరుకావాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

బస్సులో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పి.అనీస్

విశాలాంధ్ర-జియ్యమ్మవలన : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెడు వ్యసనాలకు అలవాటు పడిన వ్యక్తుల సమాచారం ఇచ్చి సమాజ శ్రేయస్సుకు సహకరించాలని చిన మేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి అనిష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పార్వతీపురం నుండి జియ్యమ్మ వలస వెళ్లే ఆర్టీసీ బస్సులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు డ్రగ్స్ వినియోగం ఫోక్సో బాల్యవివాహాలపై ప్రయాణికులకు పూర్తిగా అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్లైన్‌లో వివరాలు నమోదు చేయలేము

విశాలాంధ్ర-కురుపాం : ఆన్లైన్లో వర్కులు చేయలేమని రికార్డ్లో వర్కులు మాత్రమే చేస్తామని అంగన్వాడీ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు పి.సరళ కుమారి, కురుపాం ప్రాజెక్ట్ నాయకులు జె. సరోజ అన్నారు. సోమవారం కురుపాం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ సిబ్బందికి అంగన్వాడీలు వాడుతున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ ఆర్ ఎస్ యాప్‌ను రద్దు చేయాలని ఎన్నోసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల అందించిన స్పందించకపోవడంతో మేము ఆన్లైన్ సేవలకు స్వస్తి పలికి అంగన్వాడి కేంద్రాల్లో జరుగు తున్నటువంటి అన్ని కార్యక్రమాలు కూడ రికార్డు వర్క్ మాత్రమే నేటి నుండి చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యాప్‌లకు సహకరించని ఫోన్‌లతో పనిచేయలేం

- పాత ఫోన్‌లను అప్పగిస్తున్నాం...
కొత్తవి ఇవ్వండి : అంగన్‌వాడీలు వినతి

విశాలాంధ్ర-సాలూరు : అంగన్‌వాడీ లకు ప్రభుత్వం 2జి ఫోన్‌లు ఇవ్వడం వలన ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తున్న యాప్‌లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు సహకరించడం లేదని అందుకే ఆ సెల్‌ఫోన్ లను అప్పగిస్తున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం ఇవ్వడంతో పాటు సెల్‌ఫోన్‌లను అప్పగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ సాలూరు ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు గౌరీ, శశికలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం 2జి సెల్‌ఫోన్‌లు ఇవ్వడం వలన పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్స్ అమలకు 2జి సెల్‌ఫోన్ సపోర్ట్ చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్, ఓటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారా సరుకులు అందజేయాలని ప్రభుత్వం పెట్టిన నిబంధనను అమలు చేయటానికి అనేక ఇబ్బందులు పాలవుతున్నామన్నారు. సరయకులు అన్నీ ఒకేసారి రాకపోవడం, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పనిచేయక తమతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులకు గరవుతున్నారన్నారు. యాప్‌ల భారాన్ని తగ్గింది అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్ ఉన్నటువంటి ట్యాబ్ లను ఇవ్వాలన్నారు. కేంద్రాల నిర్వహణకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లను అప్పగించడం వలన నేటి నుండి ఆన్లైన్ పనులు నిర్వహించలేమన్నారు. హాజరు, లబ్ధిదారులకు అందించిన సరుకుల వివరాలన్నీ రికార్డులలో నమోదు చేస్తామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్యాట్యుటీని పెంపొందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు పార్వతి, అరుణ, నారాయణమ్మ, తిరుపతమ్మ, పుష్పతో పాటు పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆగని ఇసుక, మట్టి అక్రమ రవాణా

విశాలాంధ్ర-ఎటపాక : ఇసుక, మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులు ఎంత హెచ్చరిస్తున్నా వాటికి అడ్డుకట్ట వేయలే కపోతుండటం గమనార్హం. స్థానిక అవసరాలకు మినహా బయటి ప్రాంతా లకు ఇసుక అక్రమ రవాణా చేయకూడదన్న నిబంధనలను ఏమాత్రం లెక్క చేయకపోవడం శోచనీయం. ఎటపాక మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా, రహస్య డంపింగ్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలం లోని చింతల గూడెం, చేన్నం పేట, గుండాల, పురుషోత్తమ పట్నం, ప్రాంతంలో ఇసుకాసురుల అక్రమాలకు అధికారులు ఏమాత్రం కళ్లెం వేయలేకపోతున్నారన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఓవైపు అధికారుల నిఘా ఉన్నప్పటికీ ఇసుక మాఫియా అక్రమాలను ఏమా త్రం నిలువరించలేకపోతున్నారన్న విమర్శలు చోటుచేసు కుంటున్నాయి. మండలంలోనీ కొన్ని యంత్రాలతో ఇసుకను డంపింగ్ చేస్తూ అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రశ్నించిన గ్రామస్థులను బెదిరింపులకు గురి చేయడంతో మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజానీకం కోరుతున్నారు.

మండలంలో పలు పంచాయతీ సమస్యలపై మంత్రికి వినతుల వెల్లువ

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం, సంకాడ,రింతాడ, వంచుల, మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం పాడేరులో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన జరిగిన స్పందన కార్యక్రమంలో కు వినతిపత్రం అందజేసినట్టు ఆ పంచాయతీ జనసేన పార్టీ నాయకులు ఊలం ఈశ్వర్రావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, అధ్యక్షులు సిద్దు, జనసేన పార్టీ నాయకులు వనపల ఈశ్వరరావు, జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సెంబర్ గొర్ల వీర వెంకట్ తెలిపారు. పంచాయతీలోని సంకాడ కొత్తూరు నుండి గోవాడ వరకు, వసువాడ నుండి బచ్చలగొంది వరకు గల రహదారులు పూర్తికాక గిరిజనులు రాకపోకాలకు కష్టాలు ఎదుర్కొంటున్నారని, మినీ జీసీసీ డిపో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు వితంతు పింఛన్లు అందడం లేదని, రోడ్డు లు, త్రాగునీరు, జీసిసి డిపో నిర్మాణ మరమ్మత్తులు,మంత్రి దృష్టికి తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో చేపట్టిన పనులకు మండలంలో కొంతమంది లబ్ధిదారులకు బిల్లులు అందలేదని తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రికి వినతిపత్రం అందజేయడం జరిగిందని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్,సంకాడ, రింతాడ, వంచుల, పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, వనపల ఈశ్వరరావు, కొయ్యం సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం, సంకాడ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం పాడేరులో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్టు ఆ పంచాయతీ జనసేన పార్టీ నాయకులు ఊలం ఈశ్వర్రావు తెలిపారు. పంచాయతీలోని సంకాడ కొత్తూరు నుండి గోవాడ వరకు, వసువాడ నుండి బచ్చలగొంది వరకు గల రహదారులు పూర్తికాక గిరిజనులు రాకపోకాలకు కష్టాలు ఎదుర్కొంటున్నారని, మినీ జీసీసీ డిపో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు వితంతు పింఛన్లు అందడంలేదని మంత్రి దృష్టికి తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో చేపట్టిన పనులకు కొంతమంది లబ్ధిదారులకు బిల్లులు అందలేదని తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రికి వినతిపత్రం అందజేయడం జరిగిందని సంకాడ పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు తెలిపారు.

జి.మాడుగుల : అల్లూరి జిల్లా మన్యంలో ఒక రోజు

పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిమాడుగుల మండల టీడీపీ నేతలు, ఈసందర్భంగా జిమాడుగుల ఎంపిపి లోంబోరి అప్పలరాజు జిమాడుగుల మండలంలో నెలకొన్న సమస్యలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి వినతి పత్రం అందజేశారు, అనంతరం జిమాడుగుల మండలంలో తెలుగుదేశం పార్టీ పటిష్టత గురించి వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ విజయం సాధిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమెలి చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాతే లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ రైతు విభాగం కార్యదర్శి బోయినీ. బాబురావు, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి కొండపల్లి నితిన్ కుమార్, కోరపల్లి పంచాయతీ ఉపాధ్యక్షులు మాసాడి చిన్నయ్య, తెలుగుదేశం కుంతర్ల పంచాయతీ ఉపాధ్యక్షులు పూజారి రమణ, జనసేన నాయకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : రాష్ట్ర వినియోగదారుల, ఆహార పౌరసరఫరాల

శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్కు ఘన స్వాగతం లభించింది. కించుమండ గ్రామంలో విచ్చేసిన ఆయనకు కూటమి నేతలు, గిరిజన మహిళలు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. గిరిజనుల పలు సమస్యలపై ఆర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర, కూటమి నేతలు ఆనందరావు సుబ్బారావు, దన్నేశ్వరరావు, దన్నెరావు, రవి, భాస్కరరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, సామజిక గ్యాప్ అనాలిసిస్ సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : వ్యక్తిగత, సామజిక గ్యాప్ అనాలిసిస్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న మూడు సంవత్సరాలలో వ్యక్తిగత, సామజిక అవసరాలు హౌసింగ్ , తాగునీరు గృహ విద్యుదీకరణ, గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, బియ్యం కార్డు, జాబ్ కార్డ్. రోడ్ కనెక్టివిటీ, నెట్ కనెక్టివిటీ, పాఠశాలు, అంగన్‌వాడి సెంటర్, ఆరోగ్య కేంద్రం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు గ్యాప దేటా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇందు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులు గ్యాప్ అనాలిసిస్ పూర్తి చేయడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, జిల్లా విద్యాశాఖధికారి పి. బ్రాహ్మజీ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, డిఆర్డిఏ పిడి వి మురళీ సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సీజన్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలు పొందాలని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డా. శ్రీకాంత్ అన్నారు. మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో సోమవారం జరిగిన 104 వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సకాలంలో 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మందులను సక్రమంగా వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ప్రభుత్వ సూచన మేరకు జరుగుతున్న ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.

సాగునీరు అయినా ఇవ్వండి లేకపోతే క్రాఫ్ హాలిడే ప్రకటించండి

ఇరిగేషన్ కార్యాలయాన్ని చుట్టుముట్టిన రైతులు

విశాలాంధ్ర-పాలకొండ/వీరఘట్టం : తోటపల్లి ఎడమ కాలువ పాలకొండ మండలంలో చివర గ్రామాల ఆయకట్టు రైతులు,మరియు పట్టణ ప్రాంత రైతాంగం పాలకొండ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట సోమవారం తీవ్ర ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా వారాడ సుమంత్ నాయుడు, టిడిపి రైతుల ప్రతినిధి బృందం ఇరిగేషన్ డి,ఈ గన్ని రాజుకి వినతి పత్రం అందజేశారు. ఆయకట్టు రైతులు తరఫున అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు.సాగునీరు ఎప్పుడు ఇస్తారు? సాగునీరు ఇవ్వకుంటే క్రాఫ్ హాలిడే ప్రకటించండి అని జలవనుల శాఖ అధికారులను నిలదీశారు.రేపు సాయంత్రం సాగునీరు పాలకొండ ప్రాంతానికి వచ్చే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది రైతుల ఆందోళన చేస్తున్నారని,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టు రైతులు అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాల చేపట్టిన సందర్భంగా జూన్ 4వ తేదీన,సబ్ కలెక్టరు సమక్షంలో రైతు సంఘాలతో జాయింట్ సమావేశం జరిపారని,ఆ సందర్భంగా షట్టర్లు బాగు చేస్తామని,పూడికలు తీస్తామని,లస్కర్లని 32 మందిని నియమిస్తామని,ఖరీఫ్ సీజన్ కు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామని,హామీ ఇచ్చినప్పటికీ అధికారులు నేటికీ హామీలు అమలు చేయకపోవడం శోచనీయమైన చర్యని,ప్రస్తుతం సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని,శాశ్వత పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్ని గ్రామాల్లో పర్యటించి ఆందోళన తీవ్రతరం చేస్తామని,ప్రభుత్వానికి హెచ్చరించారు. రాయబారాలకు వినతి పత్రాలు పరిష్కారం చేసే రోజులు కావని,తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టు రైతులందరూ అనుబంధాలతో నిమిత్తం లేకుండా ఐక్య పోరాటాల ద్వారా సాధ్యమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొండ రుద్రపేట ఓని, లంబూరు తదితర గ్రామాల నుండి ఆయకట్టు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రైతుల ఆందోళన కు మద్దతుగాదావాలా రమణారావు, ముంజేటి త్రినాధ,గార వెంకటరమణ అనేకమంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యపై తహసిల్దార్‌కు వినతిపత్రం

విశాలాంధ్ర-పాలకొండ : ఆర్.ఎం.పి వైద్యుల సమస్యలపై స్థానిక తాసిల్దార్ రాధాకృష్ణమూర్తికి సోమవారం టిడిపి నాయకుడు పల్ల కొండబాబు వైస్ చైర్మన్ పల్లా ప్రతాపరావు ఆర్ఎంపి వైద్యులకు ఏ విధమైనటువంటి ఆంక్షలు విధించకుండా వారి విధులు వారు చేసుకునే విధంగా సహకరించాలని విజ్ఞావన పత్రాన్ని సమర్పించారు,ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యుల సంఘ ప్రతినిధి,డి గణపతి రావు మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యులు అందరము కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేస్తున్నామని,ఎ విధమైనటువంటి ఆపరేషన్ గాని ఇంజక్షన్లు గాని ఐవీ క్యాన్లు పెట్టడం గాని మేము చేయడం లేదని వ్యాధి తీవ్రత బట్టి వెంటనే మెరుగైన వైద్యం కొరకు వైద్యుల దగ్గరికి పంపిస్తున్నామని వెల్లడించారు మా పట్ల సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి తెలియపరచాలని తాసిల్దార్ ముందు వాపోయారు అందుకు తాసిల్దార్ బదిలీస్తూ తప్పనిసరిగా ఆర్ఎంపి వైద్యుల సమస్యను ప్రభుత్వానికి తెలియపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.విజ్ఞాపన పత్రం ఇచ్చిన వారిలో ఆర్ఎంపీ వైద్యులు ఏ సూర్యనారాయణ ఏ కైలాసరావు పాలవలస రామినాయుడు ఎస్ రుద్రాస్వామి సంగీతరావు రామోజీరావు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.